క్లుప్తంగా

రబీకి ఆటంకాలు తొలగిస్తాం

ఉప్పలగుప్తం: కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు మండలంలో రబీ సాగుకు ఆటంకం కలగకుండా ఉపాధి కూలీలతో డ్రెయిన్లలో పూడికలు తొలగిస్తున్నట్టు తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి తెలిపారు. మండల పరిధిలోని చినగాడవిల్లిలో 1.5 కిలో మీటర్ల మేర పూడి కతీత పనులు జరుగుతున్న గొరగనమూడి డ్రెయిన్‌ను ఏపీవో రాజామణితో కలసి ఆమె పరిశీలించారు.

విద్యార్థినికి రూ.20 వేల చేయూత



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న చేయూత సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

అమలాపురం రూరల్: పేరూరు జెడ్పీపీ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న యన మదల నాగవీర ఇటీవల ప్రమాదానికి గురై చేతికి శస్త్ర చికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. తల్లితండ్రులు శ్రీనివాస్, దేవి పేదవారు కావడంతో చేయూత సంస్థ రూ.20 వేల ఆర్థిక సహాయం చెక్కు మంగళవారం అందజేశారు. చేయూత సంస్థ ప్రతినిధులు ఎం.రవి కుమార్, పాఠశాల పీఎంసీ చైర్మన్ కడలి భాస్కరరావు, హెచ్ఎంలు ఎం.పురుషోత్తం రాజు, ఉపాధ్యాయులు కామేశ్వర రావు, గౌరీ ప్రసాద్, వెంకటేశ్వర రావు, శేషు బాల, రవి కుమార్, నాగేశ్వర రావు, చేయూత సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వాకర్స్ కో ఆర్డినేటర్ సత్య నారాయణరెడ్డికి సత్కారం

అమలాపురం టౌన్: ఇటీవల వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా–1 కో ఆర్డినేటర్‌గా నియమితులైన అమలాపురానికి చెందిన వాకర్స్ మాజీ గవర్నర్ తేతల సత్యనారాయణరెడ్డిని స్థానిక ప్రకాశం వీధిలో వాకర్లు మంగళవారం సత్కరించారు. ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి నడక, యోగా, నవ్వుల ఆరోగ్య సేవా వేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కవి నల్లా నరసింహమూర్తి, ఆరోగ్య వేదిక కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, అధ్యక్షుడు అద్దంకి అమరేశ్వరరావు, కడలి సత్యనారాయణ, కుంటప్ల సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంతాల్లో తాబేళ్ల మృత్యువాత



ఎస్.యానం సముద్ర తీరంలో చనిపోయిన తాబేలు

ఉప్పలగుప్తం: మండల పరిధి ఎస్.యానం సముద్ర తీరంలో తరుచూ తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఈ పరిస్థితి కొన్ని రోజులుగా ఉత్పన్నమవుతోందని స్థానికులు చెప్పన్నారు. మంగళవారం చనిపోయిన 3 తాబేళ్లు ఒడ్డుకు కొట్టుకువచ్చాయని వారు తెలుపుతున్నారు. జాలర్ల వలలకు చిక్కుకోవడం వలన, ఓఎన్జీసీ కార్యకలాపాల వల్ల ఇలా జరిగి ఉండవచ్చని వారు అంటున్నారు.

నేడు సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్ల సమావేశం

ఉప్పలగుప్తం: ఇటీవల నియమితులైన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు గొల్లవిల్లి నిమ్మకాయల చినరాజప్ప కళ్యాణ మండపంలో బుధవారం సమావేశం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మంత్రి పినిపే విశ్వరూప్ ముఖ్య అతిథిగా హాజరై సంక్షేమ పథకాలపై వారు నిర్వహించాల్సిన విధి విధానాలపై చర్చించనున్నట్టు తెలిపారు. ఎంపీడీవోతో పాటు గ్రామ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని బాబ్జీ తెలిపారు.

నేడు వైఎస్సార్ పెన్షన్ల వారోత్సవాలు

అమలాపురం టౌన్: మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో వైఎస్సార్ పెన్షన్ల వారోత్సవాలు బుధవారం ఉదయం జరగనున్నాయి. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో జరుగనున్న ఈ వారోత్సవాల్లో పట్టణ, రూరల్ మండలాలకు సంబంధించి కొత్తగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు అందించనున్నారు. పట్టణంలో 127 మందికి, రూరల్ మండలంలో 384 మంది కొత్త వారికి పెన్షన్లు మంజూరయ్యాయి. మొత్తం 511 మందికి కొత్త పెన్షన్లను పంపిణీ చేయనున్నారు. మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ఈ వారోత్సవాల సభకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమలాపురం పట్టణ, రూరల్ మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఈ పెన్షన్ల వారోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని విజ్ఞప్తి చేశారు.

అల్లవరంలో..

అల్లవరం: కొత్తగా మంజూరైన పింఛన్లను మంత్రి పినిపే విశ్వరూప్ పంపిణీ చేయనున్నారని ఎంపీడీఓ జి.సరోవరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుడ్డివానిచింత వద్ద సత్యకస్తూరి ఫంక్షన్ హాల్లో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే పింఛన్ల పంపిణీకి లబ్ధిదారులు, వలంటీర్లు, హాజరుకావాలని సూచించారు.

అలరించిన 'గోదాదేవి' దీపోత్సవం

- రామానుజ జీయర్ స్వామిచే అష్టదళ సమ్మేళనం
- ఆకట్టుకున్న నాదార్చన

అమలాపురం టౌన్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్థానిక కాపు కళ్యాణ మండపం వద్ద భీమవరం భాష్యకార పీఠాధిపతి త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో మంగళవారం రాత్రి జరిగిన దీపోత్సవం కన్నుల పండువగా సాగింది. పట్టణ వైశ్య సంఘం, కన్యకా పరమేశ్వరి ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. కాపు కళ్యాణ మండప ప్రాంగణంలో భక్తులచే శంఖు, చక్రం, నామాలు ఆకారంలో దీపాలు వెలిగించారు. అలాగే గోదాదేవి తిరుప్పావై వ్రతంలో భాగంగా పాశురానికి అనుసంధానంగా ఈ దీపోత్సవం జరిగింది. ఎనిమిది రకాల దళాలు అంటే నాద స్వరం, వీణా నాదం, కోలాటం, మురళీ నాదం తదితర నాదాలు, కళలతో దీపోత్సవం సాగింది. ఒక్కో నాదం, కళ వద్ద వెలిగించిన దీపోత్సవంలో ఆయా నాదాలు వినిపించారు. కళలను ప్రదర్శించారు. తొలుత జీయర్‌స్వామి కాపు కళ్యాణ మండపంలో గోదాదేవి తిరుప్పావై వ్రతాన్ని తులసీ దళాలతో చేశారు. దీపోత్సవాన్ని తిలకించేందుకు, జీయర్ స్వామి ప్రవచనాలు వినేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. వైశ్య సంఘం, ఉత్సవ కమిటీ ప్రతినిధులు నందిపాటి శ్రీనివాస్, యెండూరి వెంకట్రామయ్య, వరదా సూరిబాబు, వంకాయల కాశి, నంబూరి సత్యనారాయణమూర్తి తదితరులు భక్తులకు సేవలు అందించారు.



శంఖు, చక్ర, నామాలు, పద్మం వద్ద దీపాలంకరణ



గోదాదేవి తిరుప్పావై వ్రతాన్ని నిర్వహిస్తున్న రామానుజ జీయర్ స్వామి

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం 6 గంటల నుంచి అర్ధరాత్రి వరకూ జరిగిన సాంస్కృతికోత్సవాలు భక్తులను అలరించాయి. విద్యార్థుల నృత్య కళారూపాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా టీటీడీ వారి దాస సాహితీ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో దాదాపు 80 మంది బాలికలు చేసిన కోలాటాలు ఆకట్టుకున్నాయి. వారు ఆలపించిన భక్తి గీతాలు రంజింపచేశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉత్తర ద్వార దర్శనం సాగింది. కళాకారిణులకు ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి బహుమతులు, అభినందన పత్రాలు అందజేశారు. నృత్య, కోలాట గురువులను సత్కరించారు.

ఆకట్టుకున్న దీపాలంకరణ

ఉప్పలగుప్తం: మండల పరిధి భీమనపల్లిలో ధనుర్మాసం వైకుంఠ ద్వాదశి సందర్భంగా వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో భాగంగా భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉదయం ఏర్పాటు చేసిన దీపాలంకరణ సేవ ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచింది.



ఆత్మీయ ఆహ్వానం..



రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో వైఎస్సార్ పింఛను కానుక పంపిణీకి మంగళవారం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న మంత్రి పినిపే విశ్వరూప్

డ్రైన్ల అభివృద్ధికి సీఎంకు వినతి

అమలాపురం: కోనసీమలోని డ్రైన్లను అభివృద్ధి చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబి) ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాల ప్రారంభానికి వచ్చిన సీఎం జగన్‌ను రామారావు కలుసుకున్నారు. 130.251 కిలో మీటర్ల నిడివి కలిగిన తొమ్మిది మేజర్ డ్రైన్లు, 81.47 కిలోమీటర్ల నిడివి కలిగిన 11 మీడియం డ్రైన్లు, 256.064 కిలో మీటర్ల నిడివి కలిగిన 101 మైనర్ డ్రైన్లు, 216 కిలో మీటర్ల నిడివిగల 193 రెవెన్యూ డ్రైన్లను అభివృద్ధి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కోనసీమలోని పి.గన్నవరం, ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల పరిధిలోని ముమ్మిడివరం, అమలాపురం, అయినవిల్లి, అంబాజీపేట, అల్లవరం, ఉప్పలగుప్తం పరిధిలో ఈ డ్రైన్లు ఉన్నాయని, గోదావరి డెల్టా డ్రైనేజీ సిస్టం రెండో దశ పనుల్లో వీటిని చేపట్టి, వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తయ్యేలా చూడాలని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు.

6న జాబ్‌మేళా

ముమ్మిడివరం: స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 6న ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి శిక్షణ, మరియు సీడాప్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.లోకమాన్ తెలిపారు. ఈ మినీ జాబ్‌మేళాలో మోహన్ స్పిన్ టెక్ ఇండియా లిమిటెడ్, స్కినీడైర్ ఎల్రక్టానిక్స్ కంపెనీలు పాల్గొని సుమారు 150 మందికి ఉద్యోగవకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. జీతం రూ.13 వేల నుంచి 20 వేల వరకు ఉంటుందన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలి

అంబాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి అందించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. మొసలపల్లిలో సచివాలయాన్ని మంగళవారం సందర్శించారు. వారు మాట్లాడుతూ ప్రతి రోజు సచివాలయంలో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు నిర్వహించే స్పందనలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మేజర్ సమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు అందించాలన్నారు. అనంతరం పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ మెనూను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగాబత్తుల సత్యనారాయణ, దంతులూరి శ్రీనురాజు, కట్టా రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఊరి సేవలో పుణ్యమంతులు..

- పంచాయతీ ఆదాయం పెంపే లక్ష్యంగా సోదరుడితో సర్పంచ్ సూరిబాబు కృషి
- జి.వేమవరం పంచాయతీకి 500 కొబ్బరి మొక్కలు బహూకరణ

తాళ్లరేవు: రాజకీయాలలోకి వచ్చిన వారు పదవిలో ఉండగానే ఏదో నాలుగు డబ్బులు వెనకేసుకోవాలని చూస్తుంటారు. అయితే తాళ్లరేవు మండలం జి.వేమవరం సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు తన హయాంలో పంచాయతీ అభివృద్ధికి ఏదో ఒకటి చేయాలని సంకల్పించారు. దీనిలో భాగంగా అతని సోదరుడు సత్తిబాబుతో కలసి వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. 30 ఏళ్ల క్రితం సర్పంచ్‌గా పనిచేసిన భద్రరావు అనే వ్యక్తి నాడు పంచాయతీ స్థలాల్లో నాటిన 250 కొబ్బరి మొక్కల ద్వారా పంచాయతీకి ప్రస్తుతం సమకూరుతున్న ఆదాయాన్ని నాలుగు రెట్లు పెంచాలన్న లక్ష్యంతో పుణ్యమంతుల సోదరులు 500 కొబ్బరి మొక్కలను ఉచితంగా ఇవ్వాలని సంకల్పించారు. అలాగే పంచాయతీ ద్వారా మరో 500 మొక్కలు, మొత్తంగా వెయ్యి కొబ్బరి మొక్కలు గ్రామంలో నాటి గ్రామ పంచాయతీ ఆదాయాన్ని నాలుగు రెట్లు పెరిగేలా చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా రహదారుల వెంబడి, ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల వద్ద నాటనున్నట్లు గ్రామ సర్పంచ్ సూరిబాబు తెలిపారు. దీనికి సంబంధించి రెండు నెలల క్రితమే కడియం నుంచి నాణ్యమైన 500 కొబ్బరి మొక్కలను తెప్పించామన్నారు. వాటిని ఇంటివద్దే ఉంచి సంరక్షిస్తున్నామని, ఈ నెల 8వ తేదీ నుంచి గ్రామంలో నాటనున్నట్లు తెలిపారు. తన హయాంలోనే వాటి ఫలితాన్ని పొందాలన్న లక్ష్యంతో కేవలం రెండున్నర సంవత్సరాలలోనే కాపు కాసేలా కొబ్బరిమొక్కలను ఎంపిక చేసి తీసుకువచ్చినట్లు తెలిపారు. దీని కోసం ఒక్కొక్క మొక్కకు సుమారుగా రూ.300 చొప్పున రూ.1.5 లక్షలు తన సొంత నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. తాను చేపట్టిన కార్యక్రమానికి గ్రామ ప్రజలందరూ సహకరించాలని, ఏ ప్రాంతంలో వేసిన మొక్కలపై ఆ ప్రాంత ప్రజలు బాధ్యత తీసుకుని వాటిని కాపాడాలని సూరిబాబు కోరుతున్నారు.



జి.వేమవరం గ్రామ పంచాయతీలో నాటేందుకు సిద్ధంచేసిన కొబ్బరి మొక్కలు



సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, అతని సోదరుడు సత్తిబాబు


కామాక్షీ పీఠాన్ని సందర్శించిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి



కామేశ మహర్షితో న్యాయమూర్తి కామేశ్వరరావు

అమలాపురం టౌన్: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి వల్లూరి కామేశ్వరరావు అమలాపురంలోని శ్రీకామాక్షీ పీఠాన్ని మంగళవారం రాత్రి సందర్శించారు. పీఠాధిపతి కామేశ మహర్షి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కామేశ్వరరావును పీఠాధిపతి సత్కరించారు. ఆయనకు పీఠం జ్ఞాపిక, రెండు అధ్యాత్మిక పరిశోధన గ్రంథాలను అందించారు.

ఎమ్మెల్యే అశోక్‌కు ఆర్‌ఏఓ సత్కారం



యానాం: ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్‌ను ఆర్ఏఓ మునుస్వామి సత్కరించారు. న్యూ ఇయర్ వేడుకలను పురస్కరించుకుని ఆయనను మర్యాదపూర్వకంగా కలిసారు

ఛాయాదేవికి సత్కారం



ఛాయాదేవిని సత్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: అమలాపురం మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కల్వకొలను ఛాయాదేవిని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. స్థానిక కల్వకొలనువీధిలోని ఛాయాదేవి ఇంటికి సత్య నాగేంద్రమణి వెళ్లి ఈ సత్కారం చేశారు. ఛాయాదేవి భర్త దివంగత కల్వకొలను సాగర్ కూడా మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు. భర్త బాటలోనే భార్య ఛాయాదేవి కూడా మున్సిపల్ చైర్ పర్సన్‌గా 1995–2000 మధ్య పనిచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్డి సత్యనారాయణ, నల్లా ప్రసాద్, కల్వకొలను ఉమ తదితరులు పాల్గొన్నారు.

అరటి డొప్ప నారతో ప్రయోజనాలెన్నో



అరటి డొప్పతో నారతీసే యంత్రంపై అవగాహన కల్పిస్తున్న ఇంజినీరింగ్ కళాశాల సిబ్బంది

ముమ్మిడివరం: అరటిచెట్టు డొప్ప నార తీసి ఎండబెడితే వాటికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల ట్రైనీ అండ్ ప్లేస్‌మెంట్ డీన్ ఎం.రాధిక ముని అన్నారు. ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధిలో అరటి చెట్టు డొప్ప నుంచి నారతీసే విధానంపై మంగళవారం మహిళలకు అవగాహన కల్పించారు. యంత్రంపై ప్రయోగాత్మకంగా నార తీసే ప్రక్రియను మహిళలకు వివరించారు. ప్రాజెక్టు స్టాఫ్ పి.రమ్య, ఏ.సత్యనారాయణమూర్తి, సర్పంచ్ సలాది సీతా రామచంద్రరావు, బీర చిన్నారావు, కొండేపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో తాచుపాము హల్‌చల్



తాచుపామును డబ్బాలో బంధించిన స్నేక్ స్నాచర్ గణేష్‌వర్మ

ముమ్మిడివరం: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం తాచుపాము హల్‌చల్ చేసింది. పాఠశాల ఆవరణలో పాము కనిపించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారు. దీంతో భీమనపల్లికి చెందిన స్నేక్ స్నాచర్ గణేష్‌వర్మకు సమాచార మిచ్చారు. అతను తాచుపామును ప్లాస్టిక్ డబ్బాలో బంధించడంతో విద్యార్థులు ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

28 కేజీల గంజాయి స్వాధీనం

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలంక దుర్గమ్మ ఆలయం వద్ద నలుగురు వ్యక్తులు మంగళవారం గంజాయి అమ్ముతుండగా వారి నుంచి 28 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం అయినవిల్లిలంక వద్ద గోసంగి అఖిల్ అతడితో పాటు మరో ముగ్గురు గంజాయి అమ్ముతుండగా స్థానికులు సమాచారం మేరకు అయినవిల్లి ఎస్సై, అయినవిల్లి తహసీల్దార్ రియాజ్ కలసి పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 28 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చదువులతో సమాజం జాగృతం

సావిత్రి బాయికి జిల్లా ఐద్వా నివాళి

అమలాపురం టౌన్: చదువుల ద్వారా సమాజాన్ని జాగృతం చేయగలమన్న లక్ష్యంతో మహిళల్లో విద్యా, విజ్ఞాన దీపాలు వెలిగించిన తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రి బాయి పూలే మహోన్నత వ్యక్తి, శక్తి అని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎండీ అమిద అన్నారు. అమలాపురం మార్కెట్ వీధి, విత్తనాల కాల్వగట్టు తదితర ప్రాంతాల్లో ఐద్వా ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతిని మంగళవారం నిర్వహించారు. స్థానిక రాయల్ కళాశాలలో కూడా జయంతి సభ జరిగింది. ఈ సభలకు అమిదతో పాటు జిల్లా కార్యదర్శి టి.నాగవరలక్ష్మి అతిథులుగా పాల్గొని మాట్లాడారు. జిల్లా ఐద్వా కమిటీ ప్రతినిధులు సీహెచ్ రామలక్ష్మి, ఎం.మంగాదేవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వర కళాశాల ఆధ్వర్యంలో..

స్థానిక శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో సావిత్రి బాయి పూలే జయంతి జరిగింది. తమ ఉద్యోగాల ద్వారా విశిష్ట సేవలు అందిస్తున్న 11 మందికి కళాశాల యాజమాన్యం సత్కారాలు చేసింది. కళాశాల కరస్పాండెంట్ కేవీఆర్ నరసింహరావు, ప్రిన్సిపాల్ కె.మనోహర్, ఏవో కరాటం ప్రవీణ్ తదితరులు సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి నివాళులర్పించారు.

ఉపాధ్యాయినులకు క్రీడాపోటీలు – సత్కారాలు

తాళ్లరేవు: దేశ తొలి మహిళా ఉపాధ్యాయిని, సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక హైస్కూల్‌లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ రాయుడు సునీత ముఖ్య అతిథిగా హాజరై బడుగు, బలహీన వర్గాల మహిళలకు విద్యనందించడంలో సావిత్రీబాయి చేసిన సేవలను కొనియాడారు. అలాగే పి.మల్లవరం హైస్కూల్‌లో ఉపాధ్యాయినులను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేతలు దున్నా జనార్దనరావు, కుడుపూడి శివన్నారాయణ సత్కరించారు. పటవల హైస్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్ వి.మాచరరావు నేతృత్వంలో ఉపాధ్యాయినులకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం 11 మంది ఉపాధ్యాయినులను హెచ్ఎం టి.కాశీ విశ్వనాథం సత్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. నాయకులు రాయుడు గంగాధర్, ఉంగరాల వెంకటేశ్వరరావు, టేకుమూడి ఈశ్వరరావు, యూటీఎఫ్, ఎస్టీయూ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అల్లవరంలో..

అల్లవరం: జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవగుప్తం ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు మాట్లాడుతూ స్త్రీలను చైతన్యపరచడం కోసం మహిళా మండల్ పేరుతో సంఘాన్ని ఏర్పాటుచేశారని తెలిపారు. అనంతరం పూలే వేషధారణలో విద్యార్థినులు అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐ.పోలవరంలో..

ఐ.పోలవరం: స్థానిక పశువుల్లంక ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రామాంజనేయులు అధ్యక్షతన సావిత్రి భాయి పూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయినులు జ్యోతి, ప్రమీలను ఘనంగా సత్కరించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్

బీజేపీ అధ్వర్యంలో..

అమలాపురం రూరల్: జిల్లా బీజేపీ అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యాలయంలో సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఆయనతో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పించారు. ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి దూరి రాజేష్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జంగా రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బండారులంకలో..

బండారులంక దంగేటివారి పాలెం పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్ బొట్టు పండు అధ్యక్షతన సావిత్రీ బాయి పూలే జయంతి నిర్వహించారు. సర్పంచ్ పెనుమాల సునీత సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులు అర్పించారు. హెచ్ఎం పేపకాయల చంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ది అమలాపురం డిగ్రీ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో సావిత్రిబాయికి ఐద్వా పట్టణ అధ్యక్షురాలు కె.వరలక్ష్మి, ప్రిన్సిపాల్ సఖిలే వెంకటేశ్వరరావు, సెక్రటరీ ఎం.రాంబాబు నివాళిలర్పించారు.



గోపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సావిత్రీబాయికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

ఉప్పలగుప్తంలో..

ఉప్పలగుప్తం: మండలంలోని గోపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కె.రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం సావిత్రిబాయి చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినులను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది బడుగు సత్యనారాయణ, వీవీఎస్ రవికుమార్, జి.త్రినాథ్ కుమార్ తదిరులు ఉన్నారు.

ముమ్మిడివరంలో..

ముమ్మిడివరం: పీపుల్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక తార కళాశాలలో సావిత్రీబాయికి నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాజంలో అసమానతలు, మహిళల హక్కుల కోసం పోరాడిన మహోన్నత మహిళ సావిత్రీబాయి పూలే అన్నారు. 17వార్డు కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్, నాట్ర వీర్రాజు, పృథ్వీరాజ్, శరత్, సంస్థ అధ్యక్షులు కర్నీడి వెంకటేశ్వరరావు, ఎం.రాంజీ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

అమలాపురం రూరల్: పీఆర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ల 2023 డైరీని కోనసీమ జిల్లా పంచాయతీ రాజ్ కార్యాలయంలో జిల్లా పీఆర్ ఇంజినీరింగ్ అధికారి కె.చంటి బాబు మంగళవారం ఆవిష్కరించారు. చంటిబాబు మాట్లాడుతూ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు డైరీ ఆవిష్కరించడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ డిప్యూటీ ఈఈ, ఇంజినీర్స్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి అన్యం రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రం లో మొదటి సారి కోనసీమ జిల్లా నుంచి ఇంజినీరింగ్ అసిస్టెంట్ డైరీ తయారు చేసి అందరికీ ఆదర్శంగా నిలచిందన్నారు. ఉద్యోగులు సంఘటితంగా పని చేయాలని సూచించారు. డిప్యూటీ ఈఈ పీఎస్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ల పాత్ర సాంకేతికంగా చాలా విలువైనదని తెలిపారు.